క్లుప్తంగా

అందుబాటులో ఎంకాం కోర్సు

గంగవరం: పలమనేరు ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగంలో ఎంకాం(రెగ్యులర్) పీజీ కోర్సు అందుబాటులో ఉందని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బికాం ఉత్తీర్ణులై, ఏపీ పీజీ సెట్ 2023లో అర్హత సాధించిన విద్యార్థులు కళాశాలను ఎంచుకోవాలన్నారు. జగనన్న వసతి, విద్యాదీవెన, ఉచిత హాస్టల్ వసతి ఉందని తెలిపారు.

వాహనాల వేలంలో రూ.10.78 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న సెబ్ పోలీసులు

గంగవరం: పలమనేరు సెబ్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు జిల్లా సెబ్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ బాబుశ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం వేలం పాట నిర్వహించారు. మొత్తం 31 వాహనాల్లో 30 వాహనాలకు రూ.10.78 లక్షల ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు.

తాగునీటి బోరుకు విద్యుత్ సౌకర్యం

సదుం: మండలంలోని కంభంవారిపల్లె పంచాయతీ కురవపల్లెలో తాగునీటి బోరుకు సరఫరా చేసే విద్యుత్ లైన్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. స్పందించిన సర్పంచ్ రెడ్డిదీప విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏడీ నరేంద్ర సూచనల మేరకు శనివారం విద్యుత్ సిబ్బంది సమస్యను పరిష్కరించారు. విరిగిపోయిన రెండు స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

గంగవరం: స్థానిక లయన్స్ క్లబ్‌లో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు రఘు తెలిపారు. కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు సైతం చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలమనేరు విద్యార్థులకు స్వర్ణం



లిఖిత్‌సాయి



మోక్షిత

గంగవరం: పలమనేరులోని గంగమ్మగుడి వీధికి చెందిన హేమసుందర్ కుమారుడు లిఖిత్‌సాయి రేస్‌వాక్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. గుంటూరులో 21వ తేదీ జరిగిన అంతర్రాష్ట్ర 36వ జూనియర్ అథ్లెటిక్ స్టేట్‌మీట్‌లో గంటకి 10 కిలోమీటర్ల రేస్‌వాక్ పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచాడు. ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ నుంచి స్వర్ణ పతకం అందుకున్నాడు. అలాగే పలమనేరుకు చెందిన ప్రసాద్‌రెడ్డి కుమార్తె మోక్షిత అండర్ 14 లాంగ్‌జంప్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది.

27న సర్వసభ్య సమావేశం

గుడుపల్లె: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 27వ తేదీ స్థానిక శ్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. హాజరుకాని అధికారులపై చర్యలు తప్పవన్నారు.

అభివృద్ధి పనులపై వినతి

సదుం: మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డిని కోరారు. చిత్తూరు జెడ్పీ కార్యాలయంలో శనివారం ఆయన్ను కలసి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసేలా చొరవ చూపాలని కోరారు.

కోలాహలం.. వినాయకుని నిమజ్జనం

- మేళతాళాల మధ్య విగ్రహాల ఊరేగింపు
- రంగులు చల్లుకుంటూ నందడి చేసిన యువత



పుంగనూరు: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



సదుంలో వినాయకుని ఊరేగింపు



పుంగనూరు: తేరువీధిలో పూజలందుకున్న వినాయకుడు



రామకుప్పంలో..



బైరెడ్డిపల్లె: గంగినాయనపల్లెలో యువకుల సందడి

సదుం: చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పలు విగ్రహాలకు శనివారం సాయంత్రం నిమజ్జనోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వాహనాలపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, బ్యాండు వాయిద్యాల నడుమ స్వామి వారి నిమజ్జన వేడుకలు కోలాహలంగా సాగింది. సదుంలోని కాలేజీరోడ్డు, జాండ్రపేట, కొర్లకుంటవారిపల్లెలో ఏర్పాటు చేసిన విగ్రహాలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఊరేగింపు

రామకుప్పం: మండల కేంద్రంలోని రామనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధల నడుమ ఊరేగించారు. డప్పుల వాయిద్యాలు, గణపతి బప్ప మోరియా నామస్మరణతో యువకుల నృత్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు సాగింది. అనంతరం విగ్రహాన్ని స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

బైబై గణేశా

బైరెడ్డిపల్లె: మండలంలో ఏర్పాటు చేసి పలు వినాయక విగ్రహాలకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. వినాయక నామస్మరణతో మారుమోగించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి బైరెడ్డిపల్లె సమీపంలోని పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పుష్పం, పత్రం సమర్పయామి

పుంగనూరు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు శనివారం విశేష పూజలు నిర్వహించారు. తేరువీధిలోని వినాయక మండపంలో సాహస్త్రనామార్చన చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో మూడో రోజు స్వామివారి నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో 9వ రోజు నిమజ్జనాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పతి, గోవింద, పరమేష్, వెంకటేష్, అమర, మునిరాజ, శంకర, మనోహర్, కుట్టి, ప్రభాకర్ పాల్గొన్నారు.

పోటాపోటీగా లడ్డూ వేలం

శాంతిపురం: వినాయకచవితిని పురస్కరించుకుని గుండిశెట్టిపల్లిలో ఏర్పాటు చేసిన గణపయ్యను శనివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా స్వామి వద్ద ఉంచిన లడ్డూను వేలం వేశారు. గ్రామస్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. చివరకు గ్రామానికి చెందిన చిన్నరెడ్డి రూ.75 వేలకు దక్కించుకున్నారు. స్వామివారి పూజా కలశాన్ని రూ.15,500లకు ఉమాపతినాయుడు, శేష వస్త్రాలను రూ 5,500లకు రామచంద్రారెడ్డి పొందారు.

రూ.60 వేలు పలికిన లడ్డూ

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత దాసరిగూడెంలో వినాయకుడి లడ్డూ రూ.60 వేలు పలికింది. 45 కిలోల లడ్డూకు వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన టి.అన్నమ్మయ్య రూ.60 వేలకు పోటీ పడి దక్కించుకున్నారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన ఉట్టిని ఎవరూ కొట్టలేకపోవడంతో దానికి కూడా వేలం పాట నిర్వహించారు. ఉట్టిని గ్రామానికి చెందిన అశోక్ రూ.21 వేలకు పాడుకున్నారు. గ్రామానికి చెందిన మహిళలు ఒకే రకం చీరలు ధరించి వినాయకస్వామి పూజలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



శాంతిపురం: వేలంలో లడ్డూను దక్కించుకున్న భక్తుడు



రొంపిచెర్ల: దాసరిగూడెంలో ఒకే రకం చీరలతో పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

కుప్పంలో నేడు మెగా వైద్య శిబిరం

కుప్పం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు జగదీష్ బాబు తెలిపారు. సాయి మాత సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు గుండె, క్యాన్సర్, గైనకాలజీ తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేస్తారని వెల్లడించారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ సమైక్యతే ఎన్ఎస్ఎస్ ధ్యేయం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

పుంగనూరు: జాతీయ సమైక్యతే ఎన్ఎస్ఎస్ ధ్యేయమని శుభారాం ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ వై.రాజశేఖర్ అన్నారు. శనివారం కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ లాంటి కార్యక్రమాలతో జాతీయ సమైక్యత, సమాజసేవ, దేశభక్తి, సమాజాభివృద్ధి లాంటి విషయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. మన దేశంలో 1969 నుంచి ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, అనిల్‌కుమార్, ఆంజనేయరెడ్డి, సోమరాజు, పవిత్ర, సాహిదాభాను పాల్గొన్నారు.

చాఫ్‌కట్టర్ల పంపిణీ



పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లెలో రైతులకు శనివారం సబ్సిడీపై చాఫ్ కట్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పాడి రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. పశువైద్యాధికారి మునిచంద్ర, వెటర్నరీ అసిస్టెంట్ ఖాదర్‌వల్లి పాల్గొన్నారు.

మల్బరీ సాగులో యూరియా వాడొద్దు

- సెరికల్చర్ ఏడీ కిషోర్‌నాయక్



పంటను పరిశీలిస్తున్న సెరికల్చర్ ఏడీ కిషోర్‌నాయక్

గంగవరం: పట్టు రైతులు పండించే మల్బరీ సాగులో యూరియా వాడకం పూర్తిగా నిషేధించాలని పలమనేరు సెరికల్చర్ ఏడీ కిషోర్‌నాయక్ అన్నారు. శనివారం గంగవరం సమీపంలోని మల్బరీ పంటలను పరిశీలించారు. మల్బరీ పంటకు యూరియా వాడకం వల్ల పంట ఆకర్షణీయంగా పెరుగుతుందని కానీ అందులో పట్టుపురుగులకు కావాల్సినంత పోషకాలు ఉండవన్నారు. ఇలాంటి ఆకు పట్టు పురుగులు ఆహారంగా తీసుకుంటే త్వరగా చనిపోయే అవకాశం ఉందన్నారు. కేవలం మల్బరీ ఆకు విక్రయానికి పంట చేసే రైతులు అమ్మకాలు పెంచుకునేందుకు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. యూరియా వాడిన మల్బరీ ఆకును పట్టు రైతులు కొనుగోలు చేయవద్దని సూచించారు. పట్టు పెంపకాల్లో అధిక రాబడి రావాలంటే సొంతంగా పండించిన మల్బరీ ఆకును మాత్రమే వినియోగించాలన్నారు. మల్బరీ తోటకు పశువుల ఎరువు ఏడాదికి రెండుసార్లు వాడాలని తెలిపారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం

పుంగనూరు: సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి అన్నారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో శంకర్‌నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చెంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నెలా 4వ శనివారం కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 70 మందికి పరీక్షలు చేసి అందులో 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. నాగరాజా, మునస్వామిమొదలియార్, దిలీప్‌కుమార్, శ్రీనివాసులు, గోవిందు, ఆనందశెట్టి, బలరాంశెట్టి, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. పోలీసులకు ఫిర్యాదు

అటవీ వాచర్, మరో వర్గంపై కేసు



బీరప్పను పరామర్శిస్తున్న డీఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి

రామకుప్పం: మండలంలోని పంద్యాలమడుగు బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్ బీరప్ప, నారాయణపురం తండాకు చెందిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు తెలిపారు. వివరాలు ఇలా.. బుధవారం రాత్రి బీరప్ప నారాయణపురం తండా అటవీ పరిధిలో పెట్రోలింగ్ డ్యూటీకి వెళ్లాడు. నారాయణపురం తండాకు చెందిన యువకులు వినాయక నిమజ్జనం ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో వర్షం పడింది. యువకులు చెట్ల కింద కూర్చున్నారు. బీరప్ప వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుపైకి వచ్చింది. ఈఘటనలో ఒక యువకుడు గాయపడ్డాడు. ఈసమయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. తనపై నారాయణపురానికి చెందిన 9 మంది యువకులు దాడి చేశారంటూ బీరప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా బీరప్ప అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడిపి, తనను గాయాలపాలు చేసినట్లు నారాయణపురం తండాకు చెందిన నాగరాజునాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంగవరం: పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి మండలాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏడీ చిన్నబ్బ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

26న వి.కోటలో వైద్య శిబిరం

వి.కోట: జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ వి.కోటలోని కొత్తూరు గ్రామంలో వైద్య శిబిరం రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారులు నరేంద్ర, అమరనాథ్ తెలిపారు. బెంగళూరుకు చెందిన ఆక్స్‌ఫర్డ్ ఆస్పత్రి, రెడ్‌క్రాస్ సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గిరిజన అటవీ హక్కుల చట్టంపై గ్రామసభ



మాట్లాడుతున్న సర్పంచ్ మోహన్ నాయక్

రామకుప్పం: మండలంలోని వీర్నమల పెద్దతండా పంచాయతీ పరిధిలో గిరిజన అటవీ హక్కుల చట్టంపై సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మోహన్ నాయక్ మాట్లాడుతూ.. 2006కు ముందు నుంచి రిజర్వ్ ఫారెస్ట్ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు ప్రభుత్వం భూహక్కు పత్రం మంజూరు చేస్తుందన్నారు. అనుభవంలో ఉండి సాగుచేసుకుంటున్న వారిని గుర్తించేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా గిరిజనశాఖ సూపరింటెండెంట్ మురళి తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించిన అనంతరం శాటిలైట్ ద్వారా పరిశీలించి అర్హులను గుర్తించి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. అటవీ అధికారి పుల్లయ్య, డీటీ దిలీప్, రెస్కో డైరెక్టర్ రవినాయక్ పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు



నియామక పత్రాలు అందుకుంటున్న వలంటీర్లు

పెద్దపంజాణి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందజేయడమే ధ్యేయంగా వలంటీర్లు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వీరప్పల్లి సచివాలయ పరిధిలోని క్లస్టర్ 1, 2కు ఎంపికైన వలంటీర్లు లక్ష్మన్న, వినయ్‌కుమార్‌కు నియామక పత్రాలు అందజేశారు. సర్పంచ్ రవికుమార్, ఏఎంసీ డైరెక్టర్ ఎర్రబల్లి శ్రీనివాసులు, గట్టప్ప పాల్గొన్నారు.

వైకల్య నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సదుం: స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. వారికి సహాయ ఉపకరణాలు అందించడం కోసం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ఐఈ కో–ఆర్డినేటర్ ప్రభాకర వర్మ తెలిపారు. సదుం, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన 40 మంది శిబిరానికి హాజరైనట్లు చెప్పారు. ఎంఈఓ శ్రీరాములు, డాక్టర్లు పురుషోత్తం, శ్రీనివాస్, అసిస్టెంట్ ఐఈ లావణ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు అందరి భాగస్వామ్యం అవసరం

- మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా



స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్

పుంగనూరు: ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 స్వచ్ఛతహిసేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా కోరారు. శనివారం పట్టణంలోని ట్యాంక్‌బండ్ వద్ద స్వచ్ఛతహిసేవా కార్యక్రమంలో భాగంగా యూత్ వర్సెస్ గార్బేజ్ ప్రోగ్రామ్‌ను కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డితో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పుంగనూరు పట్టణాన్ని ప్రథమస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఇంటి చెత్తను తడిచెత్త, పొడిచెత్తతో పాటు హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు విధిగా అందించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్రవిసర్జన, ప్లాస్టిక్‌వాడకం తగ్గించాలని కోరారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని చేపడుతోందని, తడిచెత్త, పొడిచెత్త తీసుకెళ్లడానికి ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి, కుటుంబంలో ఎవరికైనా అనారోగ్య సమస్యలు ఉంటే వారిని గుర్తించి వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు సీఆర్.లలిత, నాగేంద్ర, కౌన్సిలర్లు, వార్డు కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.